క్లుప్తంగా

ఫిల్టర్‌హౌస్ ట్యాంకుల శుభ్రం



ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట, లింగాలగట్టు గ్రామ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే స్టోరేజి ట్యాంకును శని, ఆదివారాలలో శుభ్రం చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఫిల్టర్‌హౌస్‌లో గల స్టోరేజ్ ట్యాంకులను శుభ్రం చేయించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కమలకుంట్ల శేఖర్, మండ్ల రమణ, ఎస్‌కే రజాక్‌లు స్వచ్ఛందంగా రెండు రోజుల పాటు స్టోరేజి ట్యాంకుల క్లీనింగ్‌లో పనిచేశారు.

శ్రీశైలంలో విశేష పూజలు



స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలో స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకుని భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.

ముగిసిన తిరునాల

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జున స్వామి తిరునాల మహోత్సవం ఆదివారం వసంతోత్సవ కార్యక్రమంతో ముగిసినట్లు ఆలయ ఈఓ కార్తీక్ తెలిపారు. ఆదివారం వసంతోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. తిరునాల మహోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన గ్రామ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

పగిడ్యాల: నందికొట్కూరు పట్టణానికి చెందిన నీలిషికారి రాము అనే వ్యక్తి అక్రమంగా నాటుసారా తరలిస్తుండగా లక్ష్మాపురం అంచె వద్ద పట్టుకున్నామని ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ ఆదివారం తెలిపారు. అతని వద్ద నుంచి 20 లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

నందికొట్కూరు: పట్టణంలోని షికారీపేటలో నాటుసారా విక్రయిస్తున్న నీలిషికారి లక్ష్మిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆమె వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని నమోదు చేసినట్లు చెప్పారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



కుమ్మరిపేటలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయా వార్డుల్లో పర్యటించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసున్నారు. ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్యలు రాన్వికుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. డ్రైనేజీ సమస్యలపై ప్రత్యక నిఘా ఉంచామని చెప్పారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పగిడ్యాల: విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల దరఖాస్తు గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంఈఓ సుభాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు సమీపంలోని సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైకేపీ సీసీ మనోహర్‌రాజు మృతి



పాములపాడు: స్థానిక వైకేపీలో సీసీగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ రాజు(45) గుండె నొప్పితో ఆదివారం మృతి చెందాడు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు రెండు రోజుల నుంచి శ్వాస పీల్చుకోలేక ఆయాసంతో బాధపడుతుండటంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరగా ఆ కుటుంబానికి వచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఏపీఎం అనురాధ, సిబ్బంది ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య ఉషారాణి, కూతురు దియాకీర్తన ఉన్నారు.

మేలు చేసిన జగనన్నను మళ్లీ గెలిపించండి

- పొత్తుల జిత్తులమారులను నమ్మొద్దు
- సంక్షేమ పథకాలను చూసి ఓటేయండి
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- శింగవరంలో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు

మహానంది: దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని, మేలు చేసిన జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరంలో ఆదివారం 50 ముస్లిం మైనార్టీ కుటుంబాలు, మరో 50 బీసీ కుటుంబాలు మొత్తం 100 కుటుంబాలు టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ ముఖ్య నాయకులు లింగాల సుబ్బయ్య, బూరుగయ్య, మహబూబ్ బాషా, పుల్లయ్యల ఆధ్వర్యంలో టీడీపీ వార్డు మెంబర్ షేక్ మహబూబ్‌బాషాతో పాటు 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారితో పాటు బోయ బాలనాయుడు, శ్రీనివాసులు, వడ్డె తిరుపాలు, మంగలి వెంకటరమణ, శూల వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో మరో 50 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు.

ఓటమి భయంతోనే పొత్తులు

ఓటమి భయంతో ఒంటరిగా పోటీ చేయలేక టీడీపీ పొత్తులు పెట్టుకుని వస్తుందని, పొత్తుల జిత్తులమారులను నమ్మొద్దని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ ఓటేసేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఏ గ్రామంలో చూసినా సంక్షేమ పథకం రానివారు ఉండరని, 100 శాతం పథకాలు వచ్చాయన్నారు. పార్టీ గెలుపుకోసం అహర్నిశలు శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, పార్టీ ఎస్టీ విభాగం స్టేట్ జాయింట్ సెక్రటరీ విక్రమసింహా నాయక్, పరమటూరు సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, పుల్లయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

వాహనాలపై స్టిక్కర్లకు అనుమతులు తప్పనిసరి

మహానంది: వివిధ రకాల వాహనాలకు యజమానులు అతికించుకునే రాజకీయ పార్టీల స్టిక్కర్లు, జెండాలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఫ్లయింగ్ స్క్వాడ్ డీటీ బి.కామేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం, పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఉంటేనే జెండాలు, స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాసవీ సేవాదళ్ నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం వాసవీసేవాదళ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బింగుమల్ల శ్యామ్‌సుందర్‌గుప్తా తెలిపారు. సున్నిపెంటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. గౌరవ అధ్యక్షుడిగా చల్లా కిషోర్, అధ్యక్షుడిగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా చల్లా హరి, కోశాధికారిగా మొగుశారి శంకర్, ఉపకోశాధికారిగా రాచమడుగు మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆనందోత్సాహాలతో హోలి



వెలుగోడులో రంగులు చల్లుకుంటున్న దృశ్యం



పాములపాడులో ఉత్సాహంగా రంగులు చల్లుకొంటున్న యువకులు

వెలుగోడు: పట్టణంలోని జమ్మినగర్‌తండాలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా యువతీ, యువకులు రంగులు చల్లుకుంటున్నారు. చిన్నారుల కేరింతలతో వీధులు సందడిగా మారాయి. చుట్టుపక్కల తండాల్లో హోలీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగుల బండి కట్టి వీధుల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు, యువకుల కేరింతలతో వీధులు సందడిగా మారాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండావత్ శంకర్‌నాయక్, గిరిజన నాయకులు నాగేష్‌నాయక్, బద్దెనాయక్, నాగరాజునాయక్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

పాములపాడు: మండలంలో హోలి పండుగను ఆదివారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మండలంలోని యర్రగూడూరు, భానుముక్కల, బానకచెర్ల, వేంపెంట, కృష్ణానగర్ గ్రామాల్లో సుగాలి కులస్తులు ఆయా తండాల్లో మారెమ్మ దేవత, గురుజీ సేవాలాల్ మహారాజ్ లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ ఆనందంగా కేరింతలు కొట్టారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. సాయంత్రం సాంప్రదాయ నృత్యంతో సంబరాలు చేసుకున్నారు.

రైలు నుంచి కిందపడి యువకుడికి గాయాలు

మహానంది: రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడటంతో ఓ యువకుడు ప్రాణాలతో బయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా తర్లపాడు మండలం గానుగొపెంటకు చెందిన అశోక్ కాచిగూడ- గుంటూరు రైలులో వెళ్తుండగా గాజులపల్లె స్టేషన్, చలమ మధ్యలో ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాజులపల్లె రైల్వేస్టేషన్ మేనేజర్, సిబ్బంది వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది రమణ, రంగన్నలు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని వారు చెప్పారు.

సరోజమ్మ మృతికి ప్రముఖుల సంతాపం

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లె సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి పల్లె సరోజమ్మ(85) మృతి పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పగిడ్యాలలో ఆమె భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ, పార్టీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీని గద్దె దించాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం సీపీఎం డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిపై ప్రధానమంత్రి నోరు మెదపడమే కాకుండా ప్రత్యేక హోదాను విస్మరించారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కారని, ఎన్నికలు రావడంతో టీడీపీతో పొత్తు పెట్టుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏసురత్నం, రాజశేఖర్, రణధీర్, నరసింహ, స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా సంఘవిద్రోష శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా నగదు, ఎన్నికల పంపిణీకి కోసం తీసుకొని వెళ్లే వస్తువులు, తదితర వాటిపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి, బీఎస్ఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



వెలుగోడు పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: పట్టణంలోని 110వ బూత్ పరిధిలో ఆదివారం మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటా వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతున్నామన్నారు. ఏ ఇంటికి వెళ్లినా తమకు ఫలానా సంక్షేమ పథకాలు అందాయని, మా ఓటు ఫ్యాన్ గుర్తుకే అంటున్నారని చెప్పారు. ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలువబోతున్నారని, వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

మహానందిలో సండే సందడి



మహానంది కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: సెలవురోజు కావడంతో మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహా మంగళహారతుల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి కొనసాగింది.

ఓంకారంలో భక్తుల సందడి

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు, అభిషేకం పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక కాశిరెడ్డినాయన అన్నపూర్ణ ఆశ్రమంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

కోవర్టులుగా ఉంటే సహించం



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- రెండు వైపులా నటించేవారు పార్టీకి అవసరం లేదు
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- 28న నంద్యాలలో జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయండి

నందికొట్కూరు: నా వెంటే ఉంటూ టీడీపీకి కోవర్టులుగా పని చేస్తే సహించనని ఏపీ శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నందికొట్కూరు రూరల్, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు వైపులా నటించేవారు అవసరం లేదని తేల్చి చెప్పారు. నా బలం, ధైర్యం మీరేనని.. మిమ్ములనే నేను నమ్ముకున్నా.. రెండు పడవల ప్రయాణం ఎంతో ప్రమాదకరమన్నారు. ఇక్కడ సమాచారం టీడీపీ నాయకులకు చేరవేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. కులతత్వ, మతతత్వ పార్టీలు ఒక్కటైనా ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు మళ్లీ వస్తే రాష్ట్రాన్నే నాశనం చేస్తారన్నారు. ఆయన పాలనలో టీడీపీ నేతలు రాష్ట్రంలో దోచుకున్నారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి టీడీపీ నేతలకు కనిపించదా అని ప్రశ్నించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరిగే సిద్ధం బస్సు యాత్ర సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు మన్సూర్, రవియాదవ్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఎన్. వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జబ్బార్, అబుబక్కర్, నజీర్ అహ్మద్, కోకిల రమణారెడ్డి, రవి, సులోచనమ్మ, మాధురి, ఉస్మాన్‌బాషా, రామకృష్ణ, రజినీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఆత్మకూరు: క్షయవ్యాధిని కలిసికట్టుగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పట్టణ వైద్యాధికారి రాయుడు, క్షయవ్యాధి నివారణ వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయవ్యాధి భయంకరమైన వ్యాధి కాదని, పోషకాహారం, మందుల ద్వారా పూర్తిగా నయం చేయవచ్చన్నారు. అంతకు మునుపు శాస్త్రవేత్త రాబర్ట్‌కాక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జబివుల్లా, రాఘవ, మద్దిలేటి, రవికుమార్, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: టీబీ (క్షయ) వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నజీమ్ అహమ్మద్, డాక్టర్ సుధా ప్రణతి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలో టీబీ వ్యాధిపై వెలుగోడు ట్రైబల్ పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రాజు, సిబ్బంది మధుసూదన్, ఫణీంద్ర, భావన, బాలచంద్రుడు పాల్గొన్నారు.

సున్నిపెంటలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ప్రచారం ఆదివారం మొదలైంది. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సున్నిపెంటలోని బండ్లబజార్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికలలో మళ్లీ గెలిపించాలని కోరారు. అలాగే శ్రీశైలం నియోజకవర్గంలో శిల్పా చక్రపాణిరెడ్డి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేయడమే కాకుండా, సొంత నిధులతో చేపట్టిన సంక్షేమ, సామాజిక కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తిరిగి సంక్షేమ, అభివృద్ధి పాలనకు పట్టం కట్టాలని కోరారు. ప్రచారంలో మండల నాయకులు భరత్‌రెడ్డి, ఏసు, బూదాల దానియేలు, సంజీవయ్య, భద్రూనాయక్, లింగాలగట్టు నాయకులు సోమేష్, కోదండం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ నాగభూషణంయాదవ్

ఆత్మకూరు: దేశంలో ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణం యాదవ్ హెచ్చరించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాల్లో యువకులు పెద్ద ఎత్తున క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు పూర్తిస్థాయిలో నిఘా ఉంచారని, ఎక్కడ ఏ చిన్న బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం వచ్చినా కఠినంగా శిక్షిస్తామన్నారు. ఇప్పటికే బుకీలపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే 100 లేదా 9121101181 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆటను ఆస్వాదించండి..

వెలుగోడు: క్రికెట్ ఆటను చూస్తూ ఆస్వాదించాలే కానీ బెట్టింగ్ వైపు వెళ్లొద్దని.. ఎస్ఐ భూపాలుడు సూచించారు. క్రికెట్‌ను జూదంలా చూడవద్దని చెప్పారు. దేశంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభం కావడంతో ఎస్ఐ పలు సూచనలు చేశారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



టౌన్ సీఎస్ఐ చర్చి నుంచి ఈతమట్టలను పట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



శివపురం గ్రామంలో మట్టలతో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



సున్నిపెంటలో ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

నందికొట్కూరు: పట్టణంలోని, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఈతమట్టలతో ప్రార్థనలు నిర్వహించి, ఊరు వాడల్లో దేవుని బోధనలు వివరించారు. సీఎస్ఐ టౌన్ చర్చిలో ఫాదర్ మైఖేల్ రెవరెండ్‌శ్యాం సుందర్‌బాబు దైవ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి అమల్ కుమార్, ఆయా సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో గ్రామస్తులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ సంఘ కాపరి యోహాను బాబు మట్టల ఆదివారం ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ఖర్జూర మట్టలతో సంఘ కాపరులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో అన్ని గ్రామాలలో క్రైస్తవులు మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గువ్వకుంట్ల, కొత్తపల్లి, శివపురం, సింగరాజు పల్లె, ముసలిమడుగు గ్రామాలలో మండల సీఎస్ఐ సంఘం ప్రెస్బిటేట్ చైర్మన్ భరత్‌కుమార్, గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, పెద్దగుమ్మడాపురం గ్రామాలలోని రోమన్ క్యాథలిక్ చర్చీలలో ఫాదర్ బెర్నార్డ్‌ల ఆధ్వర్యంలో యేసుక్రీస్తు శ్రమల దినాలపై ప్రత్యేక ప్రార్థనలు, ప్రసంగాలు చేశారు. క్రైస్తవులు అన్ని గ్రామాలలో ఈత మట్టలు చేతపట్టి వీధుల వెంట ప్రార్థన గీతాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా మట్టల ఆదివారం



కడుమూరు గ్రామంలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు కడుమూరు, తలముడిపి, చౌట్కూరు, చెరుకుచెర్ల, మాసపేట, ఉప్పలదడియ తదితర గ్రామాల్లో ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో వెలసిన ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసు క్రీస్తు పునరుద్ధానం గురించి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. సంఘస్తుల ఆధ్వర్యంలో మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

శ్రీశైలంప్రాజెక్ట్‌లో క్రీస్తుస్తుతి

శ్రీశైలంప్రాజెక్ట్: ఈస్టర్, గుడ్‌ఫ్రైడేలను పురస్కరించుకొని శ్రీశైలం మండలంలో క్రైస్తవులు 45 రోజుల ఉపవాస ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మట్టల ఆదివారం సందర్భంగా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులు ఈత మట్టలు చేతపూని పురవీధుల్లో దావీదు కుమారునికి జయము జయము అంటూ కీర్తించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బాధితులను 108లోకి ఎక్కిస్తున్న పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: ఆదివారం నందికొట్కూరు- పగిడ్యాల రోడ్డులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. సంకిరేణిపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ పని నిమిత్తం భార్యను వెంట బెట్టుకుని నందికొట్కూరుకు బైక్‌పై వెళ్తూ రైస్ మిల్లు వద్ద రోడ్డు ప్రమాదం బారినపడ్డాడు. పంట పొలాల్లో నుంచి వేగంగా వచ్చిన కృష్ణజింక రోడ్డు దాటే ప్రయత్నంలో ప్రమాదం చోటుచేసుకుందని బాధితుడు వెల్లడించారు. అటుగా వెళ్తున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ప్రాణాపాయం తప్పిందని 108 సిబ్బంది వెల్లడించారు.